# బెగ్గర్స్ డే

-యస్. వివేకానంద

యావత్ భారతదేశంలో గల బెగ్గర్సంతా ఏకమై ఆనందోత్సాహాలతో 'బెగ్గర్స్ డే' జరుపుకోవడం గురించి ఇటు పత్రికలు అటు ఎలక్ట్రానిక్ మీడియా విశేషంగా ప్రచారం చేసినయ్.

లవర్స్ డే.. డాక్టర్స్ డే.. టీచర్స్ డే.. పేరెంట్స్ డే అంటూ ఎన్నో రకాల 'డే'లు జరుపుకుంటూ వుండగా తమను దేశంలో ఎవరూ గుర్తించకుండా నిర్లక్ష్యానికి గురిచేయడం బెగ్గర్స్ అసోసియేషన్ జీర్ణించుకోలేక... తామంతట తామే 'బెగ్గర్స్ డే' జరుపుకోవాలని తీర్మానించింది.

'బెగ్గర్స్ డే' నాడు ముష్టివారందరూ... ఏనాడూ తలకు తైల సంస్కారం లేకుండా.. గడ్డాలు పెంచుకుని.. చిరిగిన వస్త్రాలతో.. ఆమడ దూరం కంపుకొడుతూ అడుక్కునేవారంతా.. ఎంతో శుచిగా శుభ్రంగా బార్బర్ షాపులకెళ్లి గడ్డాలు గీయించుకుని, క్షురకర్మ చేయించుకుని... తలారా అభ్యంగన స్నానం ఆచరించి.. నూతన వస్త్రాలు ధరించి.. ఆలయాలకెళ్లి దైవదర్శనం గావించుకుని... ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వారికి వారే సృష్టించుకుని, సిటీలు, టౌన్లు, విలేజీల్లో వారంతా తమ ఐక్యతను చాటుకునేలా 'బేనర్లు' పట్టుకు తిరిగి యాచనకు ఉపక్రమించారు.

❖ ❖ ❖

విదేశాల్లో బెగ్గర్సంతా 'బేవార్స్' వాళ్లు కారట. ఎంచక్కా సొంత కార్లలో సూటు బూటు వేసుకుని వీధుల వెంట తిరుగాడుతూ ముష్టెత్తుకుంటారనే విషయం భారతీయ బెగ్గర్సందరికీ తెలిసింది.

ఇండియాలో గల బెగ్గర్స్ దివాళాకోరుతనానికి తెగ బాధపడ్డారు. ఈ దేశంలో తమకు తగిన గుర్తింపు లేకపోవడం... నిరాదరణకు గురవడం... ప్రభుత్వం ప్రోత్సాహిక పథకాలేవీ తమకోసం ఏర్పరచకపోవడం చూస్తూ వారిలో వారు దుఃఖించారు. ఈ అవమాన భారం నుంచి ఎలాగైనా బైటపడి సమాజంలో తాము కూడా గౌరవప్రదంగా జీవించాలని జిల్లాల వారిగా ముష్టి సంఘాలను ఏర్పరచుకుని రాష్ట్రస్థాయి.. అటుపై కేంద్ర స్థాయిలోనూ అసోసియేషన్లు ఏర్పరుచుకుని.. ఎన్నికలు నిర్వహించుకుని.. విద్యావంతులకు కులాల వారీ పర్సెంటేజి ప్రకారం పదవులు కట్టబెట్టుకున్నారు.

చైతన్యవంతమైన తమ ఆలోచనా విధానాలకు 'సెభాష్' అంటూ తామే ఎవరి వీపులు వారు చరచుకున్నారు.

యూనివర్సిల్ ప్రాబ్లమైన బెగ్గర్స్ నిర్మూలనా కార్యక్రమాలకు అడ్డుతగిలి.. తమదే పైచేయన్పించుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్.. సికింద్రాబాద్ జంట నగరాల బెగ్గర్స్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి కార్యదర్శి పదవిని శివుడు దక్కించుకున్నాడు.

శివుడు చదువు సంధ్యా లేని పప్పుసుద్దేం కాదు. డిగ్రీ హోల్డర్! అనాథ కావటాన ఆపై చదువుకి స్వస్తి చెప్పి ఉద్యోగాన్వేషణలో పడి.. వయసు మించిపోయినా జాబ్ రాకపోవడంతో విసిగి వేసారి దొంగతనాలకు పాల్పడి.. ఆ విద్య చేతకాక పోలీసుల బారిన పడి లాఠీదెబ్బలు తిని.. జైలుపాలై.. అదీ నచ్చక.. యాచక వృత్తిని జీవనోపాధిగా ఎంచుకుని ముష్టివాడుగా సెటిలై.. జీవితాన్ని మూడు పూవులు ఆరు కాయలుగా గడిపేస్తున్నాడు శివుడు.

యాచక వృత్తిలోకి దిగిన కొత్తల్లో తానొక్కడే విద్యాధికుడని విర్రవీగాడు. తర్వాత తెల్సింది.. పీజీలు.. డాక్టరేట్స్ వున్నవారు సైతం ఈ వృత్తినే ఎంచుకున్నారని.

ప్రభుత్వం గుర్తించకపోయినా బెగ్గర్స్ డే ఘనంగా జరుపుకోవటం చూస్తూ గవర్నమెంటు.. రాజకీయ నాయకులూ ముక్కున వేలేసుకున్నారు.

బెగ్గర్స్ కేడర్లోనూ అప్పర్ క్లాసు, మిడిల్ క్లాసు.. డౌన్ ట్రాడన్ అనేసి అనేక వర్గాలకు చెందిన వారుండటం చూస్తూ నివ్వెరపోయాడు శివుడు. కుల మత వైషమ్యాలు సైతం బెగ్గర్స్ మధ్య వుండటం చూచి.. శివుడి మనసు వేదనకు గురైంది.

అక్షరాస్యతా కార్యక్రమం చేపట్టి చదువులేని ముష్టివారికి విద్య నేర్పించాలని సంకల్పించి రాత్రి పాఠశాలలను వారికోసం అనేక ధర్మసత్రాల్లో నెలకొల్పి నిరక్షరాస్యులను ఒక్కతాటిపైకి తెచ్చి వారిని చైతన్యవంతులను.. విద్యావంతులను చేయ సంకల్పించాడు శివుడు.

శివుడు ఆషామాషీ మనిషేం కాదు. ఏ పని చేయ సంకల్పించినా పట్టువదలని విక్రమార్కుడై అనుకున్నది సాధించే వరకు నిద్రపోడు. అంతటి కఠోర నియమ నిష్ఠాగరిష్ఠుడు.

❖ ❖ ❖

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో అమృతరావ్ రొట్టె విరిగి నేతిలో పడటంతో మినిస్టర్ పదవి చేజిక్కించుకో కలిగినందుకు మురిసిపోతూ ఎగిరి గంతేశాడు.

ఆరోజు పర్వదినం కావటంలో పదవీ స్వీకారానంతరం అమృతరావ్ వందిమాగధులతో దైవ దర్శనానికి గుడికి బయల్దేరాడు!

మంత్రిగారు దైవదర్శనానికి వస్తున్నారనే విషయం పోలీసు వారికి తెలీటంతో గుడిమెట్లకి ఇరువైపులా వున్న ముష్టివారందరినీ అదరగొట్టి, బెదరగొట్టి తరిమేయాలనే ప్రయత్నాన్ని శివుడు అడ్డుకున్నాడు.

ఇంతలో పడవంత కారులో మినిస్టర్ అమృతరావ్ అక్కడికి రానే వచ్చాడు. పోయి పోయి పోలీసులు ముష్టివారితో ఘర్షణ పడటం మంత్రివర్యుల కంటపడితే బావుండదని అధికారగణం కారును సమీపించి సెల్యూట్ చేశారు.

కారు దిగిన అమృతరావ్ చుట్టూ ఓమారు పరికించి మెడలో పూలమాలలు తీసి పక్కనున్న పి.ఏ.లకు అందించి, అక్కడి వారిని చూస్తూ అతి వినయంగా వంకర దణ్ణం పెట్టి ముందుకు సాగబోయాడు.

మంత్రివర్యులు దైవదర్శనానికి రాబోతున్న విషయం శివుడికి తెలీటంతో అక్కడికొచ్చిన అమృతరావ్ కారును గబగబా సమీపించాడు.

ముందుకు సాగుతున్న మంత్రిగారిని అడ్డుకున్న శివుడు, ఆయనకు వినమ్రుడై నమస్కరించి- అదివరకే తాను డి.టి.పి. చేయించిన వినతిపత్రాన్ని సమర్పిస్తూ, తనను తాను బెగ్గర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా పరిచయం చేసుకున్నాడు.

అమృతరావు చెవిన విషయం పడగానే శివుడిని భుజంతట్టి ఆలింగనం చేసుకుని, నీవంటి వాడి అండ దండలు మాకుండాలి అనే భావనతో చూస్తూ వినతిపత్రాన్ని అందుకున్నాడు.

అమృతరావుతో పాటే శివుడూ వెంట నడుస్తూ...

## మనిషి-మానవత్వం

గుండె తవ్వి చూసినా
మట్టిదిబ్బలు, ఇసుక పొరల
ఎడారి జీవితాలే
కన్నీటి చలములు తప్ప
కలల దృశ్యాలేవీ
రక్తం మరకలైన హృదయాలు
తుడిచేద్దామంటే అంటుతుంది మురికి
పుట్టినపుడు మనిషే!
మనీ విలువ తెలిసాక (మృగమైపోయాడు)
మానవత్వాన్ని తాకట్టుపెట్టి మృగమైపోయాడు
మృగం ఆకలైనపుడే వెంటాడుతుంది
ఎంత వేటాడినా కడుపు నిండనిది మనిషికే!
స్వాతంత్ర్యం కోసం పోరాడిన
గాంధీజీని గాడ్సే చంపినపుడు
మానవత్వం తలదించుకొంది
మతోన్మాదుల హాస్యాస్పదానికి
మనుషులు చెల్లాచెదురై
నేలంతా నెత్తుటి ముద్దలతో ఎర్రమందారాలై
ఉన్మాదాగ్నికి ఊపిరులు విలవిలలాడినపుడు
మానవత్వంపై తెగిన గాయాలు మానకుండానే
రోజుకో హింసాగ్ని రగులుతుంటే
మానవత్వం భయంతో వణికిపోతున్నది
పవిత్రమైన దేవాలయం వంటి విద్యాలయాల్లో
రౌడీయిజం కళ్ళెర్రజేసి
ఆడపిల్లల మానాభిమానాలు దోచుకొంటుంటే
మనిషిని మనిషిగా గుర్తించలేని
మానవత్వాన్ని అనుబంధాలకు సమాధి కట్టి
సహజీవనం సజీవమై పోతుంటే
ఋణానుబంధం కన్నా- రూపాయితో బంధం
గట్టిదని
మనీతత్వాన్ని చూసి-మానవత్వం కోల్పోయినపుడు
చివరికి మిగిలేది వంటరితనమే!
ఏదో ఒకనాడు శాపగ్రస్తుడివి కాకముందే
మనిషిలో మానవత్వాన్ని మేలుకొల్పి
పదిమందికీ మంచితనాన్ని తెల్పు
-తాటికోల పద్మావతి

## విరహం

టలు మూట గట్టిస్తే
మోసుకుపోవడమే సరిపాయె-
చూపులు విసిరేస్తే
మనసుకు అతికించుకొని
మురిసిపోవడమే ముచ్చటాయె
నవ్వులు కురిపిస్తే
ఏరుకొని దాచుకోవడమె
వరమాయె-
ఎదురు చూపులు ఎంత కాలం?
ఎడారిలో నిలిపి
ఏమీ తెలియనితనంతో
దోబూచులాడ్డం
ఏం ఆనందం...
కాలం అంచుమీద
కదలిపోవడం కత్తిమీద
సాములా మారుతుంది...
ఖర్జూరపు చెట్టై కోరిక
ఒంటరితనంతో చిక్కిపోతుంది
అమాయకత్వం
ప్రేమగా నడిచొచ్చి
చిరునవ్వు మెరుపుతీగని
మనసుకు అల్లినప్పుడు
విచిత్రానుభూతి
వింతగా చూసింది
కళ్ళు మౌనంగా
పలుకరించినపుడు
హృదయ స్పందన
సహృదయంతో స్వేచ్ఛా విహంగమై ఎగిరింది
ప్రేమాక్షరాలు సువర్ణాక్షరాలై / మెరిసాయి
కనిపించడం / కరువుగా మారితే
హృదయం ఎండిపోతుంది

## రగిలించకు

అడుగుల సవ్వడి వినిపించక
పోతే
నీ మాటల ఊటలు సాగకపోతే
నీ నయనాల ప్రేమ మాధురి
ప్రవహించకపోతే...
నీ పెదాల మెరుగుల కదలికలు
మెదలకుపోతే...
ఈ పదాలకేం తకుకుంటుంది?
ఈ మాటలకేం జీవముంటుంది?
ఆకాశాన్ని ముద్దు పెట్టుకోవాలనే
ఆలోచనల దేవదారు చెట్టు
అల్లకల్లోలంగా ఊగి ఊగి ఎక్కడ
పడి ఏమైపోతుందో... కదా!
దాని శరీరానికి నీ వలపు / వసంతం పూసుకొని
తలపుల తపనతో వేగి / నిరీక్షిస్తుంది.
మౌనమా! -
ఈ ఆలోచనల గుండెల్లో / విరహాగ్ని రగిలించకు.

-ఉలయన్

'సార్ మంత్రిగారూ! ముష్టివారిని చూచి అసహ్యించుకోవటం... వారికి తోచిన రీతిన దానధర్మాలు చేయటమనేది ప్రజల్లో రాను రాను సన్నగిల్లుతోంది. మీకు తెలుసు కదా!.. దేశం యావత్తు మా అసోసియేషన్లున్నయ్. మా సంఖ్య కోట్లలో వుంది. మా కష్టసుఖాల గురించి ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, అటు కేంద్ర ప్రభుత్వం గానీ బొత్తిగా పట్టించుకోకపోవడం విచారకరం. రాష్ట్ర బడ్జెట్లో మాకంటూ ఎంతో కొంత నిధిని కేటాయించాల్సిన అవసరం ఎంతైనా వుందండీ. అసలు ముఖ్యమైన విషయం విన్నవించమంటారా? మాకు ఓటు హక్కు లేదు. ఓటర్ల జాబితాలో మా బెగ్గర్స్ వారి కుటుంబ సభ్యుల పేర్లు కన్పించవ్ సార్. ఇది రాజ్యాంగపరంగా మాకు జరుగుతున్న తీరని ఘోర అన్యాయం. అంతే కాదండీ.. మాకు తెల్ల రేషన్ కార్డు లేవు.. నివాస యోగ్యమైన ఇళ్లు లేవు. కాలవగట్ల వెంట మురికిలో.. బురదలో పొర్లుతూ దోమల బారిన పడి అనారోగ్యం పాలు కావలసి వస్తోంది. వీటన్నిటినీ మించి.. దాతలెవరైనా సరే ముష్టివారికి మినిమమ్ పది రూపాయలకు తక్కువ కాకుండా దానం చేయాలనే చట్టం తేవలసిన అవసరం ఎంతైనా వుంది. జీవన వ్యయం ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో మాకేమైనా జీతాలా? ఆరు నెలలకోమారు పెరిగే డీఏనా? అంచేత యాచకులక్కూడా జీవనభృతి ప్రభుత్వం తప్పక ఏర్పాటు చేయించాల్సిన అవసరం ఎంతైనా వుంది సార్. ఇంకా ఇంకా తన ధోరణిలో తాను చెప్పుకు పోతూనే మంత్రిగారి వెంట నడుస్తున్నాడు శివుడు.

వీడెక్కడ దాపురించాడ్రా నాయనా అని మనసులో శివుడిని తిట్టుకుంటూ, పైకిమాత్రం అతను చెప్పేవన్నీ శ్రద్ధగా ఆలకిస్తున్నవాడిలా ముఖంపెట్టి.. ఈ దరిద్రం తనవెంట ఇంకా ఎంతసేపు.. అనేసి గొణుక్కున్నాడు మినిస్టర్ అమృతరావ్.

'పోలీసుల వేధింపులు కూడా రానురానూ ఎక్కువవుతున్నాయి సార్. మామూళ్లు చాలనప్పుడు మామీద దాడిచేసి మాకు వేసిన ముష్టికోసం తాపత్రయ పడటం దారుణంసార్...' శివుడు టాపిక్ మారుస్తూ మాట్లాడాడు.

ఆ మాటలు వెంట వున్న రక్షక సిబ్బందికి బాధ కలిగినా తాము విననట్టే నటిస్తూ ఫాలో అవుతున్నారు.

'సరే మిగతా విషయాలు తీరుబడిగా తర్వాత మాట్లాడుకుందాం. మీరు నిలబడండి. నేను గుడిలోకెళ్లి దేవుడిని దర్శించుకొస్తాను..' అంటూ వెంట వున్న శివుడిని నిలువరించి మంత్రివర్యులు గబగబా ముందుకు నడిచారు.

❖ ❖ ❖

దైవదర్శనం గావించుకుని తిరిగి వస్తున్న మినిస్టర్ అమృతరావ్కి మళ్లీ శివుడు తారసపడ్డాడు.

'వీడు మళ్లీ తగులుకున్నాడేమిటి? ఈ పీడ వదలదా ఏం?' మనసులో మాట ముఖంలో అవుపించనీయక జాగ్రత్తపడ్డాడు అమృతరావ్.

'మాకూ 'బెగ్గర్స్ డే' వుంది సార్! ప్రభుత్వం కూడా మా ప్రతిపాదన పరిశీలించి ఈ రోజు బెగ్గర్స్ డేగా గుర్తించి ప్రకటించేటందుకు మీరు తప్పక సాయపడాలి సార్! సి.ఎం.గారి దృష్టికి మా డిమాండ్లు తీసుకెళ్లి బెగ్గర్స్ అందరికీ సామాజిక న్యాయం జరిగేలా తీవ్ర ప్రయత్నం చేయాలి సార్...' అనేసి గొంతుచించుకు మాట్లాడటంతోటి ముష్టివారంతా చెవులారా విన్నవారై మంత్రివర్యుల చుట్టూ చేరారు.

'బెగ్గర్స్ అసోసియేషన్.. జిందాబాద్'
'బెగ్గర్స్ ఐక్యత వర్ధిల్లాలి..'
'బెగ్గర్స్ డిమాండ్లు ప్రభుత్వం తీర్చాలి'
'మంత్రిగారూ జిందాబాద్'
'మంత్రిగారు.. వర్ధిల్లాలి..'

దిక్కులు పిక్కటిల్లేట్టు ముష్టివారంతా గొంతులు పగిలేలా నినాదాలు చేశారు.

బడుగు బలహీన వర్గాలకు చెందిన ఈ బెగ్గర్స్ ఓట్లు సైతం ఎన్నికలప్పుడు తమకు అత్యంత అవసరం. అందుచేత.. వీరికి 'బెగ్గర్స్ డే' ప్రకటించటంలో తనవంతు సాయం అందించి, వీరినీ ప్రసన్నం చేసుకోక తప్పదన్పించింది అమృతరావ్కి.

వారి నినాదాలకు ప్రసన్నుడైనా అమృతరావ్ చిరునవ్వు ముఖాన పులుముకుని శివుడితో మరోసారి కరచాలనం చేస్తూ 'మీ డిమాండ్లు తప్పక తీర్చటానికి నావంతు ప్రయత్నం తప్పక చేస్తాను. త్వరలోనే ప్రభుత్వపరంగా 'బెగ్గర్స్ డే' డిక్లేర్ చేయిస్తాను. సెలవా మరి...' అంటూ ప్రసన్నవదనంతో కారెక్కాడు.

కారు కనుమరుగయ్యే వరకు సంబరపడిన బెగ్గర్సందరూ 'మంత్రి అమృతరావ్ గారు వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేస్తూనే వున్నారు. ■

## కోల్వా బీచ్

లలు క్రమశిక్షణ కలిగిన
సైనికుల్లా కవాతు చెయ్యవు
సకల రాగాలు పలికే
హార్మోనియం మెట్లు
ఒకే ఘోషగా నినదిస్తాయి
ఎవరో వెండిని కరిగించి
చూపులు పట్టుకునే లోపల
చెరిగిపోయే అత్యాధునిక చిత్రాలు

సుదూరం నుంచి వస్తున్న కెరటం
అరె! ఎక్కడో మాయమైందే!
దాని ఉద్వేగాకృతి మాత్రం
మనసులో నిలిచిపోయింది.

ఓ పసిపిల్లవాడు
అలలకు ఎదురు వెళ్తున్నాడు
కోస్ట్గార్డ్ ఎర్రజెండా వూపుతూ
విజిల్ ఊదుతున్నాడు
సముద్రంతో కుస్తీకి సిద్ధమైన
పిల్లవస్తాదు వెళ్తూనే వున్నాడు

ఇంతలో హఠాత్ వర్షం!
వందలాది జనం పరుగో పరుగు
అయ్యో!
సముద్రమూ తడిసి వుంటుంది
పరిగెత్తడానికి కాళ్లు లేవు కదా!
ఇప్పుడు అందరి కళ్లలోనూ
సముద్రమే.

('గోవాలో సముద్రం' కావ్యం నుంచి)

-డా॥ ఎన్.గోపి